సాక్షి
గుంటూరు
బుధవారం | 6 | డిసెంబర్ | 2023



బొల్లా ఆధ్వర్యంలో పడిపూజ

వినుకొండ: స్థానిక బొల్లా కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడి పూజ జరిగింది. రెండు వేల మందికిపైగా స్వాములు పాల్గొన్నారు.



చప్టాపైకి చేరిన నీరు

నరసరావుపేట టౌన్: తుఫాన్ వల్ల మంగళవారం స్థానిక స్వర్గపురి వద్ద లో-లెవల్ చప్టాపైకి వర్షపునీరు చేరింది. సీఐ అమరేంద్ర పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

9న జాతీయ మెగా లోక్ అదాలత్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఈనెల 9న జిల్లాలోని అన్ని కోర్టులలో జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



న్యూస్‌రీల్

చురుగ్గా సహాయక చర్యలు

వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

సాక్షి, అమరావతి: ప్రకృతి విపత్తు సమయంలో ఆపదలో ఉన్న బాధితులకు అండగా నిలవాలన్న సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సహాయక చర్యలు చురుగ్గా కొనసాగుతున్నాయని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. మంగళవారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో ఆయన ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ విపత్తు సమయంలో సీఎం వైఎస్ జగన్ బాధితులకు, రైతులకు అండగా నిలిచారని చెప్పారు. ప్రభుత్వం నిబంధనలను సవరించి ధాన్యం కొనుగోలు చేస్తోందని వివరించారు. ఎవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ.. అధికారులకు సహకరిస్తూ బాధితులకు మరింత అండగా నిలవాలన్నారు.

దుర్గగుడి ఘాట్ రోడ్డు మూసివేత



విజయవాడ: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల విజయవాడ దుర్గగుడి ఘాట్ రోడ్డును మంగళవారం తెల్లవారుజామున అధికారులు మూసివేశారు. దేవస్థాన బస్సులను రద్దు చేశారు. భక్తుల ద్విచక్ర వాహనాలు, కార్లను కనకదుర్గనగర్ వైపు అనుమతించారు. ఘాట్ రోడ్డులో కొండ రాళ్లు జారిపడే అవకాశం ఉందని భక్తుల రాకపోకలను నిలిపివేశారు. మహామండపం దిగువన భక్తులు తమ వాహనాలను నిలుపుకుని మెట్లు, లిఫ్టు ద్వారా కొండపైకి చేరుకున్నారు. అమ్మవారి సన్నిధిలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది.

యార్డులో 22,596 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 20,791 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 22,596 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,500 నుంచి రూ.23,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,980 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నేడు పాఠశాలలకుసెలవు

గుంటూరు ఎడ్యుకేషన్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈఓ పి.శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి తరగతులూ నిర్వహించకుండా పర్యవేక్షించాలని డీఓఈఓ, ఎంఈఓలను డీఈఓ శైలజ ఆదేశించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 15,876, ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 838.10 అడుగుల వద్ద ఉంది.

ముంచిన మిచాంగ్

- బాపట్ల వద్ద తీరం దాటిన తీవ్ర తుఫాన్
- గుంటూరు జిల్లాలో ఎడతెగని వాన
- 34,748 హెక్టార్లలో పంటలకు నష్టం
- ప్రత్తిపాడులో 149.6 మి.మీ వర్షం
- జిల్లాలో 97 మి.మీ సగటు వర్షపాతం

అత్యవసర పరిస్థితుల్లో..

0863- 2234014
గుంటూరు జిల్లా టోల్‌ఫ్రీ నంబర్

0863-2345103
గుంటూరు నగరపాలక సంస్థ కాల్‌సెంటర్



పంట కన్నీరు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: బాపట్ల వద్ద మంగళవారం తీరం దాటిన మిచాంగ్ తుఫాన్ గుంటూరు జిల్లాలో పంటలను ముంచేసింది. సోమవారం నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో భారీగా పంట నష్టం చోటుచేసుకుంది. అధికార యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో 34,748 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

25,593 హెక్టార్లలో వరికి నష్టం

కాకుమాను, పొన్నూరు, తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, చేబ్రోలు, పెదకాకాని, ఫిరంగిపురం, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, మంగళగిరి, గుంటూరు, తాడేపల్లి మండలాల్లో 25,593 హెక్టార్లలో వరిపంట దెబ్బతింది. పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరడంతో పంట చేతికి రాదన్న భయం రైతన్నలను వెంటాడుతోంది.

- పెదకాకాని, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లో 1,020 హెక్టార్లలో పత్తి పంట దెబ్బతింది.
- తెనాలి, కాకుమాను, దుగ్గిరాల, కొల్లిపర, చేబ్రోలు, పెదకాకాని, ఫిరంగిపురం, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, మంగళగిరి, గుంటూరు, తాడేపల్లి మండలాల్లో 1,120 హెక్టార్లలో మినుము పంట దెబ్బతింది.
- పెదనందిపాడు, కాకుమాను, ఫిరంగిపురం, ప్రత్తిపాడు మండలాల్లో 6,037 హెక్టార్లలో మంచి శనగ పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.
- కాకుమాను, ఫిరంగిపురం, పెదనందిపాడు మండలాల్లో 896 హెక్టార్లలో పొగాకు పంటకు నష్టం వాటిల్లింది.
- కాకుమాను, ఫిరంగిపురం, పెదనందిపాడు మండలాల్లో 82 హెక్టార్లలో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.
- చేబ్రోలు, నారాకోడూరు, కాజ, తాడేపల్లి మండలాలలో కూరగాయలు, ఆకు కూరల తోటలకు నష్టం వాటిల్లింది.

వర్షాలు తగ్గిన వెంటనే పంటనష్టం నమోదు

వర్షాలు తగ్గిన వెంటనే పారదర్శకంగా పంట నష్టం నమోదు పూర్తి స్థాయిలో చేపట్టి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు 'సాక్షి'కి తెలిపారు. తెనాలి, వట్టిచెరుకూరు, పెదనందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు మండలాల్లో ఆయా మండల వ్యవసాయ అధికారులతో కలిసి మంగళవారం ఆయన దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకుంటుందని ఆయన రైతులకు భరోసా కల్పించారు.

ఉధృతంగా పీకలవాగు

గుంటూరు నగరంలో భారీ వర్షం పడింది. పీకలవాగు ఉధృతంగా ప్రవహించింది. తుఫాన్ తీరం దాటినా వర్షం తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కీర్తి చేకూరి పిలుపునిచ్చారు. నగర పరిధిలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే జీఎంసీ కాల్ సెంటర్ 0863-2345103కి ఫోన్ చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు వెళితే మోటార్ల ద్వారా బెయిల్ అవుట్ చేయాలని, రిజర్వాయర్లలో తాగునీటి సరఫరాకు ఏవిధమైన ఆటంకం లేకుండా పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

97 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

సోమవారం ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు జిల్లా వ్యాప్తంగా 97 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 149.6 మి.మీ, అత్యల్పంగా తుళ్ళూరు మండలంలో 45.2 మి.మీ వర్షం పడింది. మండలాలవారీగా కాకుమాను 145.8 మి.మీ., చేబ్రోలు 144.6, కొల్లిపర 119.4, దుగ్గిరాల 112.8, పొన్నూరు 106.8, వట్టిచెరుకూరు 103.1, గుంటూరు తూర్పు 100.8, పెదనందిపాడు 100.6, ఫిరంగిపురం 88.4, గుంటూరు పశ్చిమ 86.2, తెనాలి 85.4, తాడికొండ 82.4, పెదకాకాని 82, మేడికొండూరు 75.6, తాడేపల్లి 58.8, మంగళగిరి మండలంలో 58.6, మి.మీ. చొప్పున వర్షం పడింది.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

గుంటూరు వెస్ట్: మిచాంగ్ తుఫాన్ వల్ల ప్రజలు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో నిర్వహించిన టెలి కాన్ఫరెన్సులో అధికారులతో మాట్లాడారు. భారీ వర్షాల వల్ల నష్టనివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 0863- 2234014 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో జేసీ రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పంట పొలాల్లో పరిశీలన


నందివెలుగులో వరిపైరును పరిశీలిస్తున్న డీఏవో వెంకటేశ్వర్లు, ఏవో ప్రేమ్‌సాగర్, రైతులు

తెనాలిటౌన్: పెదకాకాని, తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల పరిధిలో వర్షానికి నేలవాలిన వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారులు ప్రేమ్‌సాగర్, వెంకట్రావు, శిరీష మంగళవారం పరిశీలించారు. తెనాలి మండలం నందివెలుగులో వరి పైరును పరిశీలించిన అనంతరం డీఏవో వెంకటేశ్వర్లు రైతులతో మాట్లాడారు. పంటను కాపాడుకునే విధివిధానాలపై అవగాహన కల్పించారు.

ముందుజాగ్రత్తల వల్లే ఆస్తి, ప్రాణనష్టం లేదు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

జిల్లాలో ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నందువల్లే ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లలేదని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో తుఫాన్ పరిస్థితిపై సమీక్షించారు. కాకుమాను, ప్రత్తిపాడు, చేబ్రోలు, దుగ్గిరాల, కొల్లిపర, పొన్నూరు మండలాలలో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైనందున లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస శిబిరాలలో చేర్పించాలని ఆదేశించారు. పెదకాకాని మండలం నంబూరు యానాదికాలనీలోని గుడిసెల్లోకి నీరు చేరడంతో వారిని పునరావాస శిబిరాలకు తరలించారు. అత్యవసర ఖర్చుల కోసం ప్రతి జిల్లాకు రూ. 2 కోట్లు విడుదలచేసినట్టు వెల్లడించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఎస్పీ పర్యటన

గుంటూరు ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో పర్యటించారు. తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని చేబ్రోలు, పొన్నూరు అర్బన్, రూరల్ ప్రాంతాలలో పర్యటించి అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించారు. పొన్నూరు పరిధిలో రోడ్డుపై ఒక చెట్టు పడిపోవడంతో సిబ్బందితో తొలగింపజేశారు.

నేడు పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం(గుంటూరు): మిచాంగ్ తుఫాన్ వల్ల దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో పలు రైళ్లను బుధవారం రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. గుంటూరు-రేపల్లె (07784), రేపల్లె-గుంటూరు(07785), గుంటూరు-రేపల్లె(07786), రేపల్లె-తెనాలి(07873), తెనాలి-రేపల్లె(07874), రేపల్లె-తెనాలి(07875), తెనాలి-రేపల్లె(07876), రేపల్లె-గుటూరు(07787) రైళ్లను ఈనెల 6న రద్దు చేసినట్టు వెల్లడించారు. రైలు రేపల్లె-మార్కాపురం(07889), రేపల్లె-సికింద్రాబాద్(17646), సికింద్రాబాద్-రేపల్లె((17645), రేపల్లె-సికింద్రాబాద్(17626) రైళ్లనూ బుధవారం రద్దు చేసినట్టు వెల్లడించారు.


తాడేపల్లి మండలంలో నేలవాలిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న రైతులు


నూతక్కిలో ధ్వంసమైన అరటి పంట


అధికారుల సూచనతో పెదరావూరు-కూచిపూడి రోడ్డులో పడిన చెట్టును తొలగించిన కూలీలు

విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తం

గుంటూరు ఈస్ట్: తుఫాన్ ప్రభావంతో విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ మురళీకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాపట్ల, చెరుకుపల్లి, రేపల్లె సబ్ డివిజన్లలో 20 బృందాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నారు. మురళీకృష్ణ యాదవ్ ఆయా ప్రాంతాల్లో దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరికరాలు పవర్ కట్టర్స్, మినీ జనరేటర్లు, కండక్టర్లు, తీగలు తదితరాలను సిద్ధంగా ఉంచారు. ఎక్కడికక్కడ స్థానికంగా ఉన్న ఎనర్జీ అసిస్టెంట్లను గ్రామాల్లో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. విద్యుత్ వ్యవస్థ దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేయించారు. ఎక్కువ నష్టం, ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. తుఫాన్ కారణంగా నిజాంపట్నం, పెదనందిపాడు, గంగడిపాలెం, నిడుబ్రోలు, అడవి ఫీడర్లలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ పునరుద్ధరణ పనులను సీజీఎం సుబ్బారావు, డైరెక్టర్ జయభారత్‌రావు పర్యవేక్షిస్తున్నారు.


ఫిరంగిపురంలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న ఉద్యోగి

'వరి'గిన చేలు


తెనాలిలో వర్షానికి నేలవాలిన వరిచేను

- మిచాంగ్ ధాటికి నేలవాలిన వరిచేలు
- పంట చేతికొచ్చే సమయంలో నీటిపాలు
- అన్నదాతలకు అశనిపాతం

తెనాలి: ఆరుగాలం కష్టించి పెంచిన వరిపైరు ఏపుగా పెరిగి హొయలొలుకుతుంటే సంతోషంతో మెరిసిన ఆ మోములు నేడు విషాద వదనంతో కాంతివిహీనమయ్యాయి. వారం, పదిరోజుల్లో నట్టింట్లో ధాన్యలక్ష్మి నర్తిస్తుందని మురిసిన ఆ హృదయాలు ఇప్పుడు చేలల్లో వాన విలయం చూసి మౌనంగానే రోదిస్తున్నాయి. నేలవాలిన వరిని చూసి తల్లడిల్లుతున్నాయి.

30 నుంచి 40 బస్తాల దిగుబడులు నీళ్లపాలు

గుంటూరు జిల్లాలో మాగాణి విస్తీర్ణం 1,52,411 ఎకరాలు కాగా, అందులో 1.37 లక్షల ఎకరాల్లో వరి సాగైన విషయం తెలిసిందే. పశ్చిమడెల్టా పరిధిలో తెనాలి డివిజన్‌లోనే వరి సాగు విస్తీర్ణం అధికం. ముందుగా తెనాలి ప్రాంతంలోనే వరి సాగు కోతకు వస్తుంది. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో ముందుగా వెదజల్లిన వరి చేలు కోతకు వచ్చాయి. నవంబరు చివరి వారం నుంచి ఆయా చేలల్లో యంత్రాలతో ఒకేసారి నూర్పిడి చేసేస్తున్నారు. ఎకరాకు 35-40 బస్తాల దిగుబడిని రైతులు కళ్లచూస్తున్నారు. చేల గట్లపైనా, డొంక రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని వ్యాపారులు అక్కడికే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలు ధాన్యానికి రూ.1,700 వరకు చెల్లిస్తున్నారు. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో 44,200 ఎకరాలకు గాను 11 వేల ఎకరాల్లో పైరు నూర్పిడి పూర్తయింది. మిగిలిన ఆయకట్టుతోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ వరిపైరు వారం, పదిరోజుల్లో కోతకు సిద్ధం కానుంది. నూర్పిళ్లకు రైతాంగం సన్నాహాలు చేసుకుంటోంది. నెలాఖరుకు దాదాపుగా నూర్పిళ్లు పూర్తవుతాయి. ఈ సమయంలో విరుచుకు పడిన మిచాంగ్ తుఫాన్ రైతుల ఆశలను చిదిమేసింది.

సీఎం వైఎస్ జగన్ భరోసాతో ఊరట

మంగళవారం ఉదయానికే వరిచేలు అనేక ప్రాంతాల్లో నేలవాలాయి. లోతట్టు చేలల్లో నీరు నిలిచింది. పంటచేలల్లోని వర్షపునీరు సకాలంలో బయటకు పోయేందుకు జలవనరులశాఖ పంట కాల్వలకు నీటి సరఫరా నిలిపివేసింది. నీట మునిగిన పంటచేలను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు కలత చెందుతున్నారు. వర్షం వెలిశాక, నూర్పిడి చేసేందుకు యంత్రాలు చేలల్లోకి వెళ్లాలన్నా వీలుపడదు. చేలు ఆరిన తర్వాతనే నూర్పిడికి అవకాశం ఉంటుంది. ఆలోగా చేలల్లోంచి నీరు పూర్తిగా బయటకు వెళ్లాలి. రైతులు తమ పొలాల్లోని పైరును పైకి లేపి, నిలబెట్టి కట్టలు కట్టుకుంటే పైరును కొంతమేర కాపాడుకునే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని తేమశాతంతో పనిలేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భరోసానివ్వడం రైతులకు కొండంత ఊరటనిచ్చినట్టయింది.

ముక్కోటికి ప్రత్యేక ఏర్పాట్లు

- లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సామాన్య భక్తులకే ప్రాధాన్యం
- ఉత్సవాల ఆహ్వానపత్రికలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు


ముక్కోటి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: ముక్కోటి ఏకాదశి పర్వదినాన నగరంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఉత్తర ద్వార దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చెప్పారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యమిచ్చి వారు ఎలాంటి ఇబ్బందులూ పడకుండా స్వామి దర్శనం, శంకుతీర్థం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం ఆయా శాఖల అధికారులతో తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముక్కోటి ఏర్పాట్లపై ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు సమన్వయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముక్కోటికి వచ్చే వీఐపీలు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులైనా సామాన్య భక్తులవలే క్యూలైన్లలోకి వెళ్లి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు వీఐపీల సేవలో ఉండి సామాన్య భక్తులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. భక్తుల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం తదితర అంశాలపైనా శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్, దేవస్థాన ఈఓ ఎ.రామకోటిరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్ కుమార్, డీఈఈ అక్కల సత్యనారాయణ, ఎస్ఐ మహేంద్ర, డాక్టర్ అనూష, డీఈ కృష్ణారెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

50 లారీలు, ప్రత్యేక బస్సులు సిద్ధం


డీటీసీ షేక్ కరీం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): మిచాంగ్ తుఫాన్ ప్రభావం నేపథ్యంలో సహాయక చర్యల కోసం వాహనాలు సిద్ధం చేసినట్టు డీటీసీ షేక్ కరీం చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు నుంచి కృష్ణా జిల్లాలకు ధాన్యం సరఫరాకు ప్రభుత్వ ఆదేశాల మేరకు 50 లారీలను సమకూర్చినట్టు వివరించారు. ఉప రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు మోటారు వెహికల్ తనిఖీ అధికారులను కలిసి లారీలను సిద్ధం చేసి కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, ఉయ్యూరు, గుడివాడ ప్రాంతాలకు పంపినట్లు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేకంగా పాఠశాలల బస్సులను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. జిల్లా యంత్రాంగం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రవాణా శాఖ తుఫాన్ విపత్తు సమయంలో అత్యవసర సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రజా సేవలో మేము సైతం నినాదంతో పనిచేస్తామన్నారు.

క్లుప్తంగా

అంటువ్యాధులు ప్రబలనివ్వకండి

జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి



గుంటూరు వెస్ట్: తుఫాను బీభత్సం కారణంగా గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి కుసుమ శ్రీదేవి మంగళవారం సూచించారు. గ్రామాల్లోనూ, శివారు ప్రాంతాల్లోనూ, వాగు గట్టున ఉన్న వారిని గుర్తించి వారికి తగు సూచనలు చేయాలన్నారు. వర్షపు నీరు ఉన్నచోట విష సర్పాలు, క్రిమికీటకాలతో కొంత ప్రమాదముంటుందని చెప్పారు. అవకాశమున్నంత వరకు విద్యుత్ అంతరాయ ఏర్పడకుండా చూడాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఓవర్ హెడ్ ట్యాంకులు నింపుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఆపద ఉన్నా తక్షణం స్పందించి సహకారమందించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారిల ఆదేశాల మేరకు జిల్లాలో అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉన్నారన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు.

భార్యను వేధించిన భర్తకు జైలు

సత్తెనపల్లి: భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు శిక్ష విధిస్తూ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గౌస్ మొహిద్దీన్ మంగళవారం తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడు మండలం ముసాపురం గ్రామానికి చెందిన దాసరి రాజ్యలక్ష్మి 2017 నవంబర్ 1న తన భర్త రాంబాబు మానసికంగా, శారీరకంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని గుంటూరు దిశా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై వాదోవాదనల అనంతరం మంగళవారం న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. రాజ్యలక్ష్మిని మానసికంగా, శారీరకంగా వేధించినందుకు రాంబాబుకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 5 వేలు అపరాధ రుసుము విధించారు. అంతేకాక అదనపు కట్నం కోసం వేధించినందుకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు అపరాధ రుసుం విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రసాద్ నాయక్ వ్యవహరించారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

సహకార, మార్కెటింగ్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

కారంచేడు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సహకార, మార్కెటింగ్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన మండలంలోని యర్రంవారిపాలెం గ్రామంలో ఆయన స్వగృహం వద్ద విలేకర్లతో మాట్లాడారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆయన పరామర్శించారు. అనేక మంది రైతులతో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. కలెక్టర్‌లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వారికి అవసరమైన సూచనలు చేశారన్నారు. అధికార యంత్రాంగం చేసిన కృషితో నష్ట తీవ్రత లేదన్నారు. కేవలం వరి, పొగాకు, శనగ, మొక్కజొన్న వంటి పంటలను మాత్రమే రైతులు నష్టపోయారన్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. వరద తీవ్రత తగ్గిన వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బంది పంట నష్టం అంచనాలు వేస్తారన్నారు. వీటి ఆధారంగా పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. ఎవ్వరూ అధైర్య పడొవద్దన్నారు. ముందస్తు జాగ్రత్తల్లో నిమగ్నమైన ప్రతి అధికారికి అభినందనలు తెలిపారు. మండలంలోని యర్రంవారిపాలెం గ్రామంతోపాటు మరికొన్ని గ్రామాల్లోని లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన సదుపాయాలు ఏర్పాటును ఆయన అభినందించారు. ఆయన వెంట యర్రం లక్ష్మారెడ్డి, గుదిబండి అంజిరెడ్డి, స్థానిక నాయకులు, రైతులున్నారు.

డ్రైయినేజీలో పడి వ్యక్తి మృతి

చీరాల: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో డ్రైయినేజీ కాలువలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. భారీ వర్షం కురవడంతో డ్రైయినేజి పొంగి పొర్లుతోంది. మంగళవారం మధ్యాహ్నం అతడిని గుర్తించిన స్థానికులు బయటకు తీశారు. అప్పటికే అతడు మరణించాడు. మద్యం మత్తులో పడిపోయి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ ఆధారంగా అతడి పేరు పొంద్రంగ డాక్టర్‌గా, సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద నివాసముంటున్న వ్యక్తిగా గుర్తించారు. ఒన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఆహార ప్యాకెట్లు పంపిణీ

బాపట్ల అర్బన్: బాపట్లలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పట్టణంలోని 5వేల మంది బాధితులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని రోటరీ కల్యాణ మండపంలో వంటశాల ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచి వంటకాలను చేపట్టారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాలను యుద్ధ ప్రాతిపదికపై సిద్ధం చేశారు. వివిధ వాహనాల ద్వారా బాధితులకు పంపిణీ చేశారు. డ్వాక్రా సంఘాల మహిళలు, సచివాలయాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ స్వయంగా పర్యవేక్షించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి బాధితులకు అందజేసే ఆహార ప్యాకెట్లను పరిశీలించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను పరిశీలిస్తున్న మేడికొండూరు తహసీల్దారు శ్రీనివాస శర్మ



తెనాలి మండలం ఎరుకలపూడి-కఠెవరం గ్రామాల మధ్య ప్రయాణికుల ఆటోపై విరిగిపడ్డ చెట్టు

పొంగిన వాగులు

మేడికొండూరు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి మండలంలోని అన్ని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని మేడికొండూరు నుంచి యలవర్తిపాడు వెళ్లే రహదారిలో వాగు పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దారు శ్రీనివాస శర్మ వాగులను పరిశీలించి తగిన జాగ్రత్తలు సూచించారు. వాగుమీదుగా రాకపోకలు చేయవద్దని, అత్యవసర పరిస్థితి ఎదురైతే తనను నేరుగా సంప్రదించాలన్నారు. ప్రజలకు సహాయక చర్యలు అందించేందుకు అధికారులు సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు వైద్యం అందించాలన్నారు.

తుఫాన్ పునరావాస కేంద్రాలు ఏర్పాటు



తాడేపల్లి పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న బాధితులు



నంబూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న బాధితులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రకాశం బ్యారేజీ, మంగళగిరి గౌతమ బుద్ధరోడ్డు, తాడేపల్లి సాయిబాబా గుడివద్ద ఖాళీ స్థలాల్లో వలస వచ్చిన వారు గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారు. బంగాళాఖాతంలో వాయుగుండం పడడం, అది తీవ్ర తుఫాన్‌గా మారి ఎడతెరపి లేకుండా వర్షం పడుతుండడంతో మంగళవారం వలస వచ్చిన వారిని రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సాయిబాబా గుడివద్ద వున్న ప్రాథమిక పాఠశాలలో వారికి పునరావాసం కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగిరెడ్డి, డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వలస వచ్చి యాచించుకుంటూ జీవనం కొనసాగిస్తూ 30 కుటుంబాలు పాత జాతీయ రహదారి వెంబడి సాయిబాబా గుడి వద్ద గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారు. మరో 48 గంటల పాటు అధిక వర్షాలు పడనుండడంతో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు పక్కనే నివాసముండే వారిని కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిచేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, సుమారు 30 కుటుంబాల వారిని పాఠశాల భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని, ఉదయం టిఫిన్‌తో పాటు మూడు పూటలా భోజన సదుపాయం కల్పించినట్లు వారు తెలియజేశారు. పునరావాస కేంద్రంలో ఉన్నవారందరికీ ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.



రోడ్డు పక్కన నివసిస్తున్న వారితో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగిరెడ్డి

క్షేత్రస్థాయిలో రాజకీయ ఫిర్యాదులు పరిశీలించాలి

- కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి
- పార్టీల ప్రతినిధులతో సమావేశం

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి అందిన అర్జీలు, ఫిర్యాదులను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నూతన ఓటు దరఖాస్తులు, ఫిర్యాదుల మేరకు పరిష్కారం తదితర అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్రస్థాయి పరిశీలనకు బీఎల్‌ఓలకు పంపాలని ఆదేశించారు. ఈనెల 2,3 తేదీల్లో జరిగిన స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో వచ్చిన వివిధ ఫారాలను పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పీఎస్‌ఈ (ఫొటో సిమిలర్ ఎంట్రీలు)/డీఎస్‌ఈ (డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలు) ఉన్న ఓటర్లకు ఫార్మేట్-ఏ ద్వారా రిజిస్టర్ పోస్ట్ చేశామని, ఓటర్లు తమ ఓటు ఎక్కడ ఉంచాలో / తొలగించాలో కన్ఫర్మేషన్ లెటర్ ద్వారా తెలియచేయాలన్నారు.

సమావేశంలో పశ్చిమ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీశివ జ్యోతి, ఏఈఆర్‌ఓలు బి.శ్రీనివాసరావు, ప్రదీప్ కుమార్, కోటయ్య, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ, రాజకీయ పార్టీలైన టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి సీహెచ్.వాసు, బీజేపీ నుంచి ఆర్.భాస్కర్‌రావు, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్ పాల్గొన్నారు.



రాజకీయ పార్టీ నేతలతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

అధికారులు అందుబాటులో ఉండాలి

కాకుమాను: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షం కారణంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొండపాటూరులో మంగళవారం ఆమె పర్యటించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.

ఈసందర్భంగా ఆమె మాటాడుతూ తుఫాన్ ప్రభావంతో గ్రామాల్లో పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలు జలమయవడంతో ఆప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దారు జె.ప్రసాదరావు, జెడ్పీటీసీ సభ్యుడు ముజార్‌బేగం ఉన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

సత్తెనపల్లి-అమరావతి మార్గంలో వాహనాలు నిలిపివేత

సత్తెనపల్లి: మిచాంగ్ తుఫాన్ ప్రభావం నియోజకవర్గంలో కొనసాగుతుంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీని ప్రభావం మరింతగా ఉండనుందని, ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా నియోజకవర్గ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. అధికారులు అప్రమత్తమయ్యారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పాటుపై నుంచి ఎగువ నుంచి వరద ప్రవహించడం వలన సత్తెనపల్లి మండలం నందిగామ చప్టా పైగా వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సత్తెనపల్లి – అమరావతి మధ్య రాకపోకలను మంగళవారం రాత్రి నిలిపి వేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను అడ్డుకున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నందిగామ చప్టాపై నుంచి రాకపోకలు నిషేధించడంతో నందిగామ, గుడిపూడి, పెద్దమక్కెన, మీదుగా అమరావతి వెళ్లి, వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.

పంచాయతీలపై పూర్తి అవగాహన అవసరం

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

సత్తెనపల్లి: గ్రామ పంచాయతీల పట్ల పంచాయతీ కార్యదర్శులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జేసీ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, నీటి నిల్వల తొలగింపు చేపట్టాలన్నారు. వీధి దీపాల నిర్వహణ, దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. చెత్త సేకరణ, దాని ద్వారా ఎరువు తయారీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎరువు తయారీ కార్యరూపం దాల్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమైన సమాచారం ప్రజలకు తెలియజేసేందుకు సరైన మాధ్యమాలు సకాలంలో ఉపయోగించుకోవాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు సర్వే నెంబర్, సబ్ డివిజన్ అప్లికేషన్ చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. రెవెన్యూ రికార్డుల్లో పేరు లేని వారికి ఈ అప్లికేషన్లు పెట్టకూడదన్నారు. రెవెన్యూ రికార్డుల్లో పేరు సవరణ, తండ్రి పేరు సవరణ, ఫోన్ నెంబర్ మార్పునకు మ్యూటేషన్ లేదా కరెక్షన్ అప్లికేషన్లు పెట్టించాలన్నారు. అనంతరం ఏపీ పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, ఈఓపీఆర్‌డీ దయాసాగర్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

నిరుద్యోగ యువతకు రుణాలు ఇప్పించాలి..

సత్తెనపల్లి: జిల్లాలో నిరుద్యోగ యువతకు ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో భాగంగా ప్రాజెక్టులు ఏర్పాటు చేయించి వారికి రుణాలు కల్పించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. మంగళవారం సత్తెనపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్‌పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జేసీ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ పెద్దపెద్ద ప్రాజెక్టుల ద్వారా రూ. 5 లక్షలు, రూ.10 లక్షలు, ఆపైన వారికి రుణాలు కల్పించి తద్వారా యూనిట్లు ఏర్పాటు చేయిస్తే స్వతహాగా వారు వృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటాం

రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాజ్యసభ మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. మండలంలోని ఆరవపల్లి గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయటమే కాకుండా రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారన్నారు. తుఫాన్ హెచ్చరికలు వెలువడిన నాటి నుంచి జిల్లా, మండల స్థాయి యంత్రాంగం ప్రజలను చైతన్య భరిస్తూ ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా శ్రమించిందన్నారు. నియోజకవర్గంలో 18 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు వసతి కల్పించినట్లు చెప్పారు. కేంద్రాల్లో ఉన్న బాధితులకు ఆహారం, మందులు అందిస్తున్నామని చెప్పారు. తుఫాన్ తీవ్రత తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీట మునిగి మొక్కలు వచ్చిన వరి కంకులను ఆయన పరిశీలించి వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు అంజయ్య, ఆరవపల్లి సర్పంచి లోయ బాబు నాంచారయ్య, వ్యవసాయ శాఖ ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అరవల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న మోపిదేవి

పంట కాలువలో గుర్తుతెలియని మృతదేహం

మార్టూరు: పంట కాలువలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన ఇంకొల్లు సమీపంలోని పావులూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామ రైతులు తమ పొలాల సమీపంలో పంట కాలువలు బైక్‌తో సహా ఓ యువకుడు నిర్జీవంగా కనిపించడంతో ఇంకొల్లు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు యువకుడి మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చి పరిశీలించారు. యువకుడు తన్నీరు బ్రహ్మయ్య తండ్రి రామయ్య బీసీ కాలనీ మార్టూరుకు చెందిన వ్యక్తిగా తన జేబులోని బైక్ ఆర్సీ ఆధారంగా గుర్తించారు. వివరాలను మార్టూరు పోలీసుస్టేషన్‌కు ఇంకొల్లు పోలీసులు పంపించగా మార్టూరు ఎస్సై శ్రీనివాసరావు వివరాలు సేకరిస్తున్నారు. మృతుడి వయసు సుమారు 30 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

జిల్లా డేటా ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా డేటా ప్రాసెసింగ్ సెంటర్ (రీ సర్వే, భూమి రికార్డుల శాఖ)ను పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మంగళవారం ప్రారంభించారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రీ సర్వేకి సంబంధించి టీం వర్క్‌గా పని చేసేందుకు ఈ సెంటర్ దోహద పడుతుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సంబంధించిన రీ సర్వే, భూమి రికార్డులకు సంబంధించి ఇక్కడ పని చేసుకోవడానికి అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ఈ సెంటర్ కావలసిన అన్ని సిస్టమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి, జిల్లా సర్వేయర్ నాగశంకర్, సత్తెనపల్లి డివిజన్ డీఐ విజయ్‌కుమార్, తహసీల్దార్ ఎస్.సురేష్, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, రీ సర్వే టీం, తదితరులు ఉన్నారు.

సాగులో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథూర్
- ముగిసిన అగ్రిటెక్ వ్యవసాయ సాంకేతిక సదస్సు

గుంటూరు రూరల్: వ్యవసాయంలో ప్రస్తుతం దిగుబడి ఎంత వచ్చిందో అనేది కాకుండా నికర ఆదాయం ఎంత వచ్చింది అనే విషయం ప్రాధాన్యత సంతరించుకుందని జీతాయ నూనెగింజల పరిశోధన సంస్థ (ఐఐఓఆర్) డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథూర్ పేర్కొన్నారు. గత మూడు రోజులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తాధ్వర్యంలో లాం నందున్న విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అగ్రిటెక్ - 2023 వ్యవసాయ సాంకేతిక సదస్సు మంగళవారంతో ముగిసింది. సదస్సు మూడోరోజు అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా మిల్లెట్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రీకరణలో భాగంగా ఉపయోగించే డ్రోన్లు, కొత్త యంత్రాలు కుసుమలాంటి పంటల్లో ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. మొక్కలు ఎక్కువగా ముల్లులు కలిగి ఉన్న పంటల్లో మనుషులతో వ్యవసాయ యాజమాన్య పద్ధతులు చేపట్టేందుకు వీలు కాని పంటలకు ఇవి ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. సెన్సార్ బేస్డ్ నీటిపారుదల పరికరాలు ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో ఉపయోగకరంగా మారాయన్నారు. జాతీయ చిరుధాన్యాల సంస్థ పరిశోధన డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి మాట్లాడుతూ చిరుధాన్యాలు 4 వేల సంవత్సరాల నుంచి నుంచి సాగులో ఉన్నాయని గుర్తు చేశారు. చిరుధాన్యాల సాగులో మెలకువలను డాక్టర్ మాధవీలత వివరించారు. చిరుధాన్యాలు విజయవంతంగా సాగు చేస్తున్న రైతు రేనాటి రామసుబ్బారెడ్డి తన అనుభవాలను వివరించారు. చిరుధాన్యాలను శుభ్రపరిచే యంత్రాలు, సాగు చేసే విధానాలు రైతు విజయభూషణ్‌రెడ్డి, చిరుధాన్యాల విలువల పెంపుపై, మార్కెటింగ్‌లను నరసింహనాయక్‌లు వివరించారు. గత రెండు రోజులుగా ప్రదర్శనను తిలకించి తమ అభిప్రాయాలను చక్కగా వివరించి క్విజ్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. రైతులు, విద్యార్థులు ప్రేక్షకులను ఆకట్టుకున్న మొదటి మూడు స్టాల్స్ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనకు, హోండా కంపెనీకి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి, రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, పాలక మండలి సభ్యులు డాక్టర్ చైతన్యకుమారి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి.కరుణాసాగర్, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అలరించిన స్టాల్స్‌కు బహుమతులు అందజేస్తున్న వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి